క్లుప్తంగా

కాలనీలో సమస్యలు పరిష్కరించండి



కొత్తకోట: మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డులో గల అయ్యప్ప ఎన్‌క్లేవ్ ఎంప్లాయిస్ కాలనీలో గల సమస్యలను పరిష్కరించాలంటూ ఆదివారం కాలనీవాసులు మున్సిపల్ చైర్‌పర్సన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీలో డీటీసీపీ లే అవుట్ అనుమతులు ఉన్నప్పటికీ కాలనీలో సమస్యలు ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ముఖ్యంగా అంతర్గత రోడ్లను సీసీ రోడ్లు, సైడ్ డ్రెయినేజీలు, మిషన్ భగీరథ నీళ్లు వంటి సమస్యలను పరిష్కరించడంతో పాటు అసంపూర్తిగా ఉన్న పార్కు పనులు పూర్తి చేయించి, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



చిన్నంబావి: మండలంలోని పెద్దమారుకు చెందిన శ్యామలమ్మకు రూ.60 వేలు, టాక్టర్ కృష్ణకు రూ.60 వేల సీఎం సహాయనిధి చెక్కులను ఆదివారం బీఆర్ఎస్ నాయకులు బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందుతుందన్నారు. చెక్కు మంజూరుకు సహకరించిన ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డికి, మండల నాయకులకు బాధిత కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గోవింద్ శ్రీధర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ బగ్గరి నరసింహారెడ్డి, ఉపసర్పంచ్ భీసన్న, వార్డు సభ్యుడు నాగేషు పాల్గొన్నారు.

పాట చిత్రీకరణ



ఆత్మకూర్: పట్టణానికి చెందిన షార్ట్‌ఫిల్మ్ డైరెక్టర్ ఎంగల్ రజనీకాంత్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'సెలయోరల్లే నీనవ్వు మరదల' పాటను ఆదివారం ప్రత్యేక పూజల అనంతరం చిత్రీకరించారు. ఎస్ఎల్ఎస్ మ్యూజిక్ ఆల్బం ద్వారా ఎన్నో పాటలను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు దర్శకుడు తెలిపారు. కార్యక్రమంలో ఎంగల్ గాయత్రి, భవాని, నితిన్, తిలక్, కెమెరామెన్ లక్ష్మణ్, నటీనటులు ఉన్నారు.

విరాళం అందజేత



కొత్తకోట: పట్టణ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఛత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటుకు పట్టణ కేంద్రానికి చెందిన కొమ్ము అనిల్‌కుమార్ తనవంతు సాయంగా రూ.25వేలు విరాళంగా అందజేశారు. ఛత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటు కార్యక్రమంలో దాతలు ముందుకు వచ్చి సహకారం అందిస్తే త్వరలో పనులు పూర్తి చేసుకొని విగ్రహ ప్రతిష్ఠ చేసుకోవడం జరుగుతుందని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో హిందూవాహిని సభ్యులు ప్రహ్లాద్, శ్రీకాంత్ ఉన్నారు.

కబడ్డీ, వాలీబాల్ పోటీలు ప్రారంభం

అడ్డాకుల: మండలంలోని రాచాలలో చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన కబడ్డీ, వాలీబాల్ పోటీలను బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్ ప్రారంభించారు. గ్రామానికి చెందిన సర్పంచ్ తల్లి పాశం చెన్నమ్మ జ్ఞాపకార్థం కబడ్డీ పోటీలను ఏర్పాటు చేశారు. చెన్నమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంతకుముందు ఆయన చెన్నకేశవస్వామి ఆలయంలో పూజలు చేసి తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ తిరుపతయ్య యాదవ్, బీజేపీ నాయకులు సుదర్శన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మున్నూర్ రమేష్, బుచ్చన్న, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చంద్రగఢ్ ఎత్తిపోతలకు గ్రహణం



చంద్రగఢ్ ఎత్తిపోతల పంప్‌హౌస్

అమరచింత: మండలంలోని చంద్రగఢ్ ఎత్తిపోతల పథకానికి విద్యుత్ సరఫరా నిలిచి నాలుగు నెలలు గడుస్తున్నా సంబంధిత ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకోవడం లేదు. సమస్యను పరిష్కరించి ఎత్తిపోతలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఆదేశించినా ట్రాన్స్‌కో అధికారులు మాత్రం సమస్యను దాటవేయడంతోనే కాలాన్ని సరిపెడుతున్నారు. దీంతో ఆయకట్టు రైతులు పంటకు సాగునీరు ఎప్పుడు అందుతుందా అని ఎదురు చూడాల్సిన దుస్థితి దాపరించింది. చంద్రఘడ్ ఎత్తిపోతలకు అమరచింత పట్టణంలోని 33/11కేవీ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా జరుగుతుండగా నాలుగు నెలల కిందట భారీగా వీచిన ఈదురు గాలులు, వర్షాలకు చింతల కుంటతో పాటు వ్యవసాయ పొలాల మీదుగా వెళ్లిన మొత్తం ఎనిమిది స్తంభాలు విరిగి పడటంతో చంద్రఘడ్ ఎత్తిపోతలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అప్పటి నుంచి ఆయకట్టు రైతులతో పాటు ఎత్తిపోతల సంఘం నాయకులు పలుమార్లు ట్రాన్స్‌కో అధికారులకు విన్నవించినా ఫలితం లేదు.

ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతరు

చంద్రఘడ్ ఎత్తిపోతల పథకానికి వెంటనే విద్యుత్‌ను సరఫరా పునరుద్ధరించాలని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ట్రాన్స్‌కో ఎస్ఈకి ఆదేశించినా ఇప్పటి వరకు వాటి మరమ్మతు పనులను చేపట్టలేక పోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది.

నిర్లక్ష్యమే కారణం



నాలుగు నెలల కిందట కరెంటు లేదని ట్రాన్స్‌కో ఏఈకి చెప్పినం. అప్పుడు ఇప్పుడు అంటూ కాలన్ని దాటేస్తున్నారే తప్ప మరమ్మతు చేయట్లేదు. ఇదే విషయాన్ని ఆయకట్టు రైతులతో కలిసి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం. అయినా సమస్యను పరిష్కరించట్లేదు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ట్రాన్స్‌కో అధికారులపై చర్యలు తీసుకొని, రైతు ప్రయోజనాలను కాపాడాలి.

– సర్వారెడ్డి, సర్పంచ్, ఎత్తిపోతల సంఘం అధ్యక్షుడు, మిట్టనందిమళ్ల

వేగంగా పనులు చేస్తాం

చంద్రఘడ్ ఎత్తిపోతలకు వేగంగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. మెటీరియల్ అందిన వెంటనే మరమ్మతు పనులు చేపట్టి విరిగి పడిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త వాటిని బిగించి విద్యుత్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటాం.

– రాంచంద్రయ్య, ఏఈ, ట్రాన్స్‌కో

కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో విఫలం



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న భవన నిర్మాణ రంగ సంఘం నాయకులు

అమరచింత: భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని తెలంగాణ ప్రగతి శీల భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజు అన్నారు. మండల కేంద్రంలో ఫిబ్రవరి 1న కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆదివారం విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రకటించినట్లుగా భవన నిర్మాణ కార్మికులందరికీ ఉచితంగా మోటార్ సైకిల్ ఇవ్వాలన్నారు. ప్రమాదంలో మరణించినా, శాశ్వత వైకల్యం ఏర్పడినా రూ.10 లక్షలు, పెళ్లి కానుక, ప్రసూతి సాయం రూ.లక్ష ఇవ్వాలని డిమాండ్ చేశారు. 60ఏళ్లు నిండిన కార్మికులందరికీ రూ.ఆరు వేల పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. భవన రంగ కార్మికుల పిల్లలకు ఉపకార వేతనాలు, ఇళ్లు లేని వారికి డబుల్ బెడ్‌రూంలు, సొంత స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షలు మంజూరు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న క్లయిమ్‌లను వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ నిర్వహించే ధర్నాలో భవన నిర్మాణ రంగ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు జిలాని, విజయ్, అనిల్, నరసింహ, సత్యన్న, భీమన్న, ఎలక్ట్రికల్ ఆయుప్, ధనుపాల్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబాలకే దళితబంధు ఇవ్వాలి



మాట్లాడుతున్న సర్దార్ మేడి పాపన్న

ఖిల్లాఘనపురం: రాష్ట్ర ప్రభుత్వం దళితులకు ఇస్తున్న దళితబంధు పథకంలో నిరుపేద కుటుంబాలకే ముందుగా ప్రాముఖ్యత ఇవ్వాలని మాదిగ దండోర జాతీయ అధ్యక్షుడు సర్దార్ మేడి పాపన్న మాదిగ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని మున్నూరుకాపు కల్యాణ మండపంలో ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఆయన మాట్లాడుతూ సామాజిక సంపదకు దూరమైన దళితులు ఆర్థికంగా, రాజకీయంగా వివక్షను ఎదుర్కొంటున్నారన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు అవుతునాన్న దళితులు జీవితాల్లో ఇంకా చీకటి ఆవరించి ఉందని వాపోయారు. ప్రభుత్వాలు మారుతున్నా తమ బతుకులు మారడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. దళితబంధు పథకం ప్రవేశపెట్టి ఏడాది కావస్తున్నా అమలు విషయంలో అనేక చీకటి కోణాలు కన్పిస్తున్నాయని ఆరోపించారు. ఇప్పుడు నియోజక వర్గానికి 500 మందికి మాత్రమే దళిత బంధు అనడం ఇబ్బందిగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెపోగు శ్రీనివాస్, జాతీయ కార్యదర్శి భగవంతు, రాష్ట్ర కార్యదర్శి కురుమూర్తి, జిల్లా అధ్యక్షుడు యాదయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ నరేష్, ప్రధాన కార్యదర్శి యాదగిరి, ఉపాధ్యక్షులు రత్నయ్య, కార్యదర్శి వెంకటయ్య, తిరుమలేష్, బాలయ్య పాల్గొన్నారు.

హాత్‌సే హాత్ జోడో యాత్రను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

పెబ్బేరు: హాత్‌సే హాత్ జోడో అభియాన్ యాత్రను కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు జయప్రదం చేయాలని వనపర్తి కౌన్సిలర్ బ్రహ్మంచారి కోరారు. పట్టణ కేంద్రంలోని సహార ఫంక్షన్‌హాల్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం హాత్‌సే హాత్ జోడో అభియాన్ యాత్రపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రతి గడపకు చేరాలని కాంగ్రెస్ గతంలో చేసిన అభివృద్ధి, కార్యాచరణ గురించి వివరించాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఈ యాత్రకు శ్రీకారం చుట్టారని తెలిపారు. ఈ యాత్రకు ఏఐసీసీ కార్యదర్శి, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ డాక్టర్ చిన్నారెడ్డి పాల్గొంటుండడంతో ప్రజలు, కార్యకర్తలు అధికంగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు అక్కి శ్రీనివాస్‌గౌడ్, విజయవర్ధన్‌రెడ్డి, వెంకటేష్‌సాగర్, సురేందర్‌గౌడ్, వెంకట్రాములు, రణధీర్‌రెడ్డి, నరసింహానాయుడు, రంజిత్ కుమార్, రాములు, జాంగీర్, సునీల్, మన్నెం, వీరస్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎస్ఐ రామస్వామి, మాస్టర్ శ్రీనివాసులు

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని సుమన్ కరాటే కిడ్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఇంటర్ డోజో కరాటే చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఐ రామస్వామి మాట్లాడుతూ ఆత్మరక్షణ కోసం కరాటేను ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని సూచించారు. ముఖ్యంగా బాలికలకు కరాటే నేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపాలన్నారు. ఈ పోటీల్లో పెబ్బేరు, కొత్తకోట విద్యార్థులు 100 మంది పాల్గొనగా.. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాస్టర్ శ్రీనివాసులు, వేణుగౌడ్, కాసిం, దాదిమియా ఉన్నారు.

సారా విక్రయిస్తున్న వ్యక్తుల అరెస్ట్



పెద్దకొత్తపల్లి: మండలంలోని మర్రికల్‌కి చెందిన ముగ్గురు నాటుసారా విక్రయిస్తూ పట్టుబడిన వారిని అరెస్ట్ చేసినట్లు కొల్లాపూర్ ఎక్సైజ్ సీఐ ఏడుకొండలు తెలిపారు. మర్రికల్‌లో అక్రమంగా నాటుసారా విక్రయిస్తున్న స్థావరాలపై ఆదివారం ఉదయం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు. ఎక్సైజ్ అధికారులు మాట్లాడుతూ గ్రామాలలో నాటుసారా అమ్మిన, తయారు చేసిన కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ దాడులలో పరమేష్‌గౌడ్, చిన్నయ్యగౌడ్, రాజ, మహేష్, దస్తగిరి, పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

పాన్‌గల్: అంధత్వ నివారణ కోసం ప్రభుత్వం ఉచితంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాన్‌గల్, అన్నారంతండా, మాందాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాలపై ఆయా గ్రామాల స్థానిక ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల సిబ్బంది ప్రజలను చైతన్యం చేసి శిబిరాలకు ఎక్కువ మంది హాజరయ్యేలా చూడాలన్నారు.

నేడు ఎమ్మెల్యే చిట్టెం పర్యటన

ఆత్మకూర్: మండలంలో వివిధ కార్యక్రమాలకు ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి పాల్గొంటారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్‌యాదవ్ తెలిపారు. ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా సోమవారం సాయంత్రం 6 గంటలకు స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సన్మాన సభ ఏర్పాటు చేశామన్నారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

విద్యుదాఘాతంతో దున్నపోతు మృతి

పాన్‌గల్: విద్యుత్ షాక్‌తో దున్నపోతు మృతిచెందిన సంఘటన చింతకుంటలో ఆదివారం చోటుచేసుకుంది. బాధిత రైతు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రైతు చింతం రాములు తన పాడి పశువులను గ్రామ సమీపంలోని పంట పొలాలకు మేతకు తీసుకెళ్లాడు. సమీపంలోని వాగులో నీరు తాగేందుకు వెళ్లిన దున్నపోతు వాగులో నడుస్తున్న విద్యుత్ మోటార్‌కు తగిలి షాక్‌తో మృతిచెందినట్లు పేర్కొన్నారు. దున్నపోతు మృతి చెందడంతో అప్రమత్తమైన రైతు మిగితా పశువులను దూరం తీసుకవెళ్లడంతో పెద్ద ప్రమాదం తప్పిందన్నారు. దీని విలువ దాదాపుగా రూ. 50 వేల వరకు ఉంటుందని వాపోయాడు. విషయం తెలుసుకున్న స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు రమాదేవి, బీఆర్ఎస్ నాయకులు రవీందర్‌గౌడు బాధిత రైతును పరామర్శించి ప్రభుత్వ పరంగా సహాయం అందేలా చూస్తానని భరోసా ఇచ్చారు.

బోనాల పండుగకు ఏర్పాట్లు

కొల్లాపూర్: కొల్లాపూర్‌లో పోషమ్మ, ఈదమ్మ దేవతల బోనాల పండుగల ఏర్పాట్లను మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మీ పరిశీలించారు. ఆదివారం సాయంత్రం కోటమైసమ్మకు సంప్రదాయబద్ధంగా రైతుసంఘాల ఆధ్వర్యంలో నైవేద్యాలు సమర్పించారు. సోమవారం పోషమ్మ దేవత, మంగళవారం ఈదమ్మ దేవతలకు తొలి బోనాలు సమర్పించనున్నారు. పోషమ్మ, ఈదమ్మ గుడుల వద్ద భక్తులకు ఏర్పాటుచేసిన వసతీ సౌకర్యాలను చైర్‌పర్సన్ పరిశీలించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలని రైతు సంఘాలకు సూచించారు. ఆమె వెంట కౌన్సిలర్ డాక్టర్.రాముడుయాదవ్, నాయకులు చంద్రశేఖరాచారి, వాసు ఉన్నారు.

నేటి నుంచి వెంకన్న బ్రహ్మోత్సవాలు



పెద్దకొత్తపల్లి: దేవల్‌తిరుమలాపూర్‌లోని శ్రీవెంకటేశ్వరస్వామి శ్రీదేవి, భూదేవి బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమవుతాయని దేవాలయ ధర్మకర్త సర్పంచ్ సత్యం తెలిపారు. మండల కేంద్రానికి 3 కి.మీ.ల దూరంలో ఉన్న దేవల్‌తిరుమలాపూర్‌లో 400 ఏళ్ల క్రితం వెలసిన శ్రీవెంకటేశ్వరస్వామి శ్రీదేవి, భూదేవి సమేతంగా వెలసిన ఆలయంలో భక్తుల పూజలు అందుకుంటున్నారు. కాకతీయుల కాలంలో ఈ దేవాలయాన్ని ప్రతాపరుద్రుడు ఏర్పాటు చేశారని శిలాశాసనాలు చెబుతున్నాయి. ప్రతి ఏడాది వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మాగమాసంలో ప్రారంభమై నెల రోజులపాటు జాతర కొనసాగుతుంది. ఈ ప్రాంత ప్రజలు తీరితే తిరుపతి తీరకుంటే తిరుమలాపురం అని నమ్మకంతో పూజలు నిర్వహిస్తారు. ఈ బ్రహ్మోత్సవాలలో వనపర్తి, అచ్చంపేట, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి మొక్కులు తీర్చుకుంటారు. బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభమై ఫిబ్రవరి 7 వరకు కొనసాగుతాయని ఆలయ ధర్మకర్త సత్యం తెలిపారు. బ్రహ్మోత్సవాలు సోమవారం అంకురార్పణ, 31న గజవాహనసేవ, ఫిబ్రవరి 1న శేషవాహన సేవ, ఫిబ్రవరి 2న హనుమంతు వాహనసేవ, 3న గరుడవాహన సేవ, 4న కల్యాణమహోత్సవం, 5వ తేదీన శ్రీవేంకటేశ్వరస్వామి శ్రీదేవి, భూదేవి రథోత్సవం, 6న అశ్వవాహన సేవ, 7న అంచవాహన సేవలు జరుగుతాయని ఆలయ కమిటీవారు తెలిపారు.

రామన్‌పాడు దారి బాగుచేస్తాం

సాక్షి ఎఫెక్ట్..



రామన్‌పాడుకు వెళ్లే మార్గంలో ముళ్లపొదలు తొలగిస్తున్న ప్రొక్లెయినర్

ఆత్మకూర్: పట్టణం నుంచి రామన్‌పాడ్ ప్రాజెక్టుకు వెళ్లే మార్గం అధ్వానంగా మారింది. ఈవిషయమై ఆదివారం సాక్షి దినపత్రికలో వార్త ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు పరిధిలోకి వచ్చే ఈరోడ్డుకు ఇరువైపులా ముల్లపొదల తొలగింపు, కల్వర్టు నిర్మాణం, రోడ్లపై ఏర్పడ్డ గుంతల పూడికకు గాను రూ. 8లక్షలు మంజూరయ్యాయని రామన్‌పాడ్ ఏఈ అనిల్‌రెడ్డి తెలిపారు. ముళ్లపొదల తొలగింపు పూర్తి స్థాయిలో చేపడుతామని, నీరు తగ్గిన వెంటనే కల్వర్టు నిర్మాణం, రోడ్లకు మరమ్మతు చేపడుతామని అన్నారు.

నేటి నుంచి హాజీమలాంగ్‌బాబా ఉర్సు



అమరచింత: మస్తీపురం గుట్టలో వెలసిన శ్రీ సయ్యద్‌షా హజ్రత్ హాజీ మలాంగ్ బాబా ఉర్సు ఆదివారం రాత్రి గంధోత్సవంతో ప్రారంభం అవుతున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈమేరకు ముర్షద్ మైనోద్దీన్ మాట్లాడుతూ 29న గంధోత్సవం, 30న ఉర్సు, 31న ఫాతేహా కార్యక్రమాలు కొనసాగనున్నాయన్నారు. హాజీమలాంగ్ బాబా దర్గాను దర్శించడానికి రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతున్నారని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా దర్గా వద్ద నిర్వహణ కార్యక్రమాలను చేపడుతున్నామని పేర్కొన్నారు.

రేపటి నుంచి పాన్‌గల్ ఈదమ్మ జాతర



ఆలయంలో కొలువుదీరిన ఈదమ్మ



షిడె కోసం అలంకరించిన రథం

పాన్‌గల్: మండల కేంద్రంలోని ఈదమ్మ దేవత జాతర మంగళవారం రోజు నిర్వహిస్తున్నట్లు పూజారి నాగన్న తెలిపారు. రెండు రోజుల పాటు నిర్వహించే జాతరలో మొదటి రోజు 'షిడి', రెండో రోజు పోలారం బండ్లు, బోనాలు కార్యక్రమం ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. జాతరకు ఉమ్మడి పాలమూరు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటారు. జాతర సందర్భంగా అమ్మవారి ఆలయం ఎదుట పలు మిఠాయిలు, బొమ్మల దుకాణాలు వెలిశాయి. ఈదమ్మ ఉత్సవాల కోసం గుడిని ముస్తాబు చేశారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా స్థానిక గ్రామ పంచాయతీ, గుడి కమిటీ సభ్యుల సమన్వయంతో అన్ని ఏర్పాట్లు చేసినట్లు వారు పేర్కొన్నారు.

వేలాడుతున్న తీగలు: పొంచి ఉన్న ప్రమాదం



పొలాలకు వెళ్లే దారిలో కిందకి వేలాడుతున్న విద్యుత్ తీగలను చూపిస్తున్న రైతులు



ఇళ్ల ఎదుట..

- ఇది వరకే అనేక సంఘటనలు
- భయాందోళనలో కత్తెపల్లి గ్రామస్తులు

ఆత్మకూర్: మండలంలోని కత్తెపల్లిలో చేతులెత్తితే విద్యుత్ తీగలు తగులుతున్నాయని, ఇది వరకే ఎన్నో ప్రమాదాలు చోటు చేసుకున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈవిషయమై ట్రాన్స్‌కో అధికారులకు పలుమార్లు సమాచారం అందించినా పట్టించుకోవడం లేదని సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదం జరగక ముందే ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ తీగలు సరిచేసి ప్రమాదాలను నివారించాలని కోరుతున్నారు.

త్వరలోనే పరిష్కారం..

కత్తెపల్లిలో విద్యుత్ తీగలు కిందికి వేలాడుతున్న విషయం తమ దృష్టికి రావడంతో గ్రామంలో తీగలను పరిశీలించాం. త్వరలోనే విద్యుత్ తీగలను బిగించి సమస్యను పరిష్కరిస్తాం.

– నర్సింహులు, ఏఈ ట్రాన్స్‌కో, ఆత్మకూర్